సాక్షి
కాకినాడ

గురువారం । 10 । అక్టోబర్ । 2024



ఎండాకు వణుకు

ఖరీఫ్ సాగు చేతి కొచ్చే తరుణంలో ఎండాకు తెగులు వెంటాడుతోంది. ఇప్పటి వరకూ ప్రకృతి వైపరీత్యాలతో రైతులు ఇబ్బందులు పడ్డారు.


II లో



భగవంతుడు సర్వాంతర్యామి

భగవంతుడు సర్వాంతర్యామి అని పరిపూర్ణానందస్వామి అన్నారు. కాకినాడ శ్రీ పీఠంలో భక్తులను ఉద్దేశించి మాట్లాడారు.

74 వేల క్యూసెక్కుల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి బుధవారం సాయంత్రం 74,151 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. బ్యారేజీ వద్ద 10.90 అడుగులకు నీటిమట్టం చేరింది. డెల్టా కాలువలకు 12,200 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

న్యూస్‌రీల్

సరస్వతీదేవిగా బాలాత్రిపుర సుందరి అమ్మవారు



సామర్లకోట: శరన్నవరాత్రుల్లో భాగంగా బుధవారం మూలా నక్షత్రాన్ని పురస్కరించుకుని పంచారామ క్షేత్రంలోని బాలాత్రిపుర సుందరి అమ్మవారు సరస్వతిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ఈఓ బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేసి సాయంత్రం దర్బారు సేవ, ప్రసాద వితరణ నిర్వహించారు.

15న అరుణాచలానికి బస్సు

తుని: ప్రజల విజ్ఞప్తి మేరకు తుని నుంచి అరుణాచలానికి సూపర్ లగ్జరీ బస్సును ఈ నెల 15న నడుపుతున్నట్టు డిపో మేనేజరు కిరణ్ కుమార్ బుధవారం తెలిపారు. ఉదయం 10 గంటలకు తుని డిపో నుంచి బయలుదేరి, విజయవాడ, శ్రీకాళహస్తి, కాణిపాకం, శ్రీపురం, అరుణాచలం, కంచి యాత్రను పూర్తి చేసుకుని తుని వస్తుందన్నారు. టికెట్ ధర రూ.3,500గా నిర్ణయించామన్నారు. వివరాలకు 73829 13216, 80743 80569 సెల్ నంబర్లకు సంప్రదించాలని కోరారు.

పద్మభూషణ్ పాణింగిపల్లి 'తూర్పు' వాసే



రాజమహేంద్రవరం రూరల్: న్యూఢిల్లీలో మంగళవారం కన్నుమూసిన పద్మభూషణ్ అవార్డు గ్రహీత, ఆల్ ఇండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ (ఎయిమ్స్) మాజీ డైరెక్టర్ డాక్టర్ పాణింగిపల్లి వేణుగోపాల్ (82) రాజమహేంద్రవరం వాసే. భారతదేశపు మొట్టమొదటి గుండె మార్పిడిని నిర్వహించి కార్డియాక్ సర్జరీకి మార్గదర్శకుడిగా నిలిచిన ఆయన రాజమహేంద్రవరంలో జన్మించారు. ఎంబీబీఎస్‌లో మొదటి గోల్డ్‌మెడల్‌ను దేశ మొదటి రాష్ట్రపతి రాజేంద్రప్రసాద్ నుంచి, ఎంఎస్‌లో మొదటి గోల్డ్‌మెడల్ మొదటి ప్రధాని జవహర్‌లాల్‌నెహ్రూ నుంచి అందుకున్నారు. ఢిల్లీలోని ఎయిమ్స్‌లో కార్డియోథొరాసిక్ విభాగాన్ని ప్రారంభించారు. ఎయిమ్స్ డైరెక్టర్‌గా బాధ్యతలను నిర్వర్తించారు. 1994లో కొద్దిరోజుల్లో చనిపోతాడన్న దేవీరామ్ అనే వ్యక్తికి బ్రెయిన్‌డెడ్ అయిన వ్యక్తి హార్ట్‌ను తీసి దేశంలోనే మొట్టమొదటిసారిగా హార్ట్ ట్రాన్స్‌ప్లాంటేషన్ చేశారు. ఆయనను 1998లో పద్మభూషణ్‌తో పాటు, డాక్టర్ బీసీ రాయ్ అవార్డు, ఆల్‌ఇండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ లైఫ్‌టైమ్ అవార్డుతో పాటు అనేక అవార్డులు వరించాయి.

తమ్ముళ్ల మాటే శాసనం

- మద్యం దుకాణాల దరఖాస్తుల్లో అరాచకం
- ముడుపు కడితేనే దాఖలుకు అవకాశం
- 'మాట్లాడుకునేందుకు' క్యాడర్ నియామకం
- స్వామి భక్తి చాటుకుంటున్న అధికారులు
- తునిలో దరఖాస్తుదారుల అడ్డగింపు.. దీంతో పిఠాపురంలో ఆన్‌లైన్‌లో దాఖలు
- రెండు రోజుల గడువు పెంపుతో చెలరేగిపోతున్న టీడీపీ క్యాడర్



సాక్షి ప్రతినిధి, కాకినాడ: మద్యం దుకాణాలకు దరఖాస్తుల గడువు పెంచడంతో తెలుగు తమ్ముళ్లు చెలరేగిపోతున్నారు. తమ నాయకులతో ఒప్పందాలు చేసుకోకుండా దరఖాస్తులు చేయడానికి కుదరదంటూ దౌర్జన్యాలకు దిగుతున్నారు. పలు ఎక్సైజ్ స్టేషన్లలో సైతం దేశం నేతల అనుయాయులు చెప్పినట్టు నడుచుకుంటే తప్ప దరఖాస్తులు తీసుకోని పరిస్థితులు కనిపిస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా సిండికేట్‌లను దారికి తెచ్చుకోవడానికి నేతలు గడువు పెంపు అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారు. డీడీతో కూడిన దరఖాస్తు దాఖలు చేయకుండా, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ పోలీసు స్టేషన్‌లో అడుగుపెట్టకుండా అడ్డుకుంటున్నారు. ఇందుకోసం స్టేషన్ల బయట నియోజకవర్గాల ప్రజాప్రతినిధుల అనుచరగణం మందీ మార్బలంతో కాచుకుని కూర్చున్నారు. షెడ్యూల్ దాఖలు చేయాలంటే ముందుగా నియోజకవర్గ ప్రజాప్రతినిధితో మాట్లాడండంటూ బెదిరింపులకు దిగుతున్నారు. అలా మాట్లాడించే బాధ్యతలను ప్రతి ఎక్సైజ్ పోలీసు స్టేషన్ వద్ద నలుగురైదుగురు ప్రధాన అనుచరులను కాపలా పెట్టారు. జిల్లాలో పలు నియోజకవర్గాల్లో బుధవారం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ లోపలికి వెళ్లి దరఖాస్తు చేయకుండా అనుచరగణం అడ్డుకుంది. ప్రభుత్వం ముందుగా నిర్దేశించిన ప్రకారం దరఖాస్తులకు గడువు బుధవారంతో ముగియనుండటంతో సిండికేట్ సభ్యులు దరఖాస్తు చేయడానికి క్యూ కట్టారు. ఓ షాపునకు దరఖాస్తు చేయాలంటే మా నియోజకవర్గ నేతకు రూ.5 లక్షలు ముందుగా చేతిలో పెట్టాల్సిందేనని చెప్పడంతో సిండికేట్ సభ్యులు ఖంగుతిన్నారు.

ప్రధానంగా తుని, ప్రత్తిపాడు, పెద్దాపురం నియోజకవర్గాల్లో ఈ పరిస్థితులు కనిపించాయి. ప్రత్తిపాడు నియోజకవర్గం పరిధిలోని రౌతులపూడి మండలంలోని రెండు దుకాణాలకు దరఖాస్తు చేసేందుకు వెళ్లిన వారిని తుని ప్రాంతానికి చెందిన నలుగురు టీడీపీ వర్గీయులు అడ్డుకున్నారు. ప్రత్తిపాడు నియోజకవర్గంలోని రౌతులపూడి మండలం గతంలో ప్రత్తిపాడు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఉండేది. ఇప్పుడది తుని ఎక్సైజ్ పోలీసు స్టేషన్ పరిధిలోకి మారింది. ఈ క్రమంలో రౌతులపూడి మండలానికి కేటాయించిన రెండు దుకాణాల కోసం దరఖాస్తు చేసేందుకు తుని ఎక్సైజ్ స్టేషన్‌కు వెళ్లిన పలువురు సిండికేట్ సభ్యులకు తెలుగు తమ్ముళ్లు అడ్డు తగిలారు. ముందుగా నియోజకవర్గ నాయకులతో మాట్లాడుకుని రూ.5 లక్షలు ఒప్పందం చేసుకుంటేనే దరఖాస్తు చేసేందుకు అనుమతిస్తామని తెగేసి చెప్పారు. రౌతులపూడి మండలంలో దుకాణాలు తుని నియోజకవర్గంతో సంబంధం లేదని ఎంత చెప్పినా దరఖాస్తు చేయనివ్వలేదని తెలియవచ్చింది. ఈ పరిస్థితుల్లో వారు పిఠాపురం వెళ్లి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి వచ్చింది. ప్రత్తిపాడు నియోజకవర్గంలో నాలుగు మండలాలను నలుగురు అనుచరులకు అప్పగించి సిండికేట్‌లతో సంప్రదింపులు జరుపుతున్నారు.

దుకాణాలకు దరఖాస్తు చేయాలంటే ఒప్పందానికి రావాల్సిందేనని నియోజకవర్గ ముఖ్యనేత అనుచరగణం అల్టిమేటమ్ ఇచ్చింది. ఇందుకు ఎక్సైజ్ పోలీసులు కూడా తందానతాన అంటున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కాకినాడ సిటీ, కాకినాడ రూరల్, పెద్దాపురం, జగ్గంపేట నియోజకవర్గాల్లో కూడా టీడీపీ నియోజకవర్గ ప్రజాప్రతినిధుల ఆదేశాలతో వారి అనుచరగణం సిండికేట్ ప్రతినిధులతో ఒప్పందాలు కొలిక్కి వస్తేనే అనుకున్న దుకాణాలకు దరఖాస్తులు చేసేందుకు వారు అనుమతిస్తున్నారు. లేదంటే వారిని తిప్పి పంపేస్తున్నారు. ప్రభుత్వం ఎలాగూ దరఖాస్తులకు గడువు శుక్రవారం వరకు పెంచడంతో ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని మా నేతలతో ఒప్పందాలు చేసుకోండని చెప్పి తిప్పి పంపేస్తున్నారు. ముందుగా దరఖాస్తు చేసుకోనిస్తే ఆ తరువాత మాట్లాడుకుంటామని ఎంత చెబుతున్నా వారు ఒక పట్టాన అంగీకరించడం లేదని దరఖాస్తుదారులు వాపోతున్నారు. ఈ పరిస్థితుల్లో దరఖాస్తులు దాఖలు చేయలేక వెనుతిరిగి నియోజకవర్గ ముఖ్యనేత అనుచరులతో సంప్రదింపులకు సిద్ధమవుతున్నారు. జిల్లాలోని కాకినాడ సిటీ, కాకినాడ రూరల్, తుని, ప్రత్తిపాడు నియోజకవర్గాల్లో ఈ పరిస్థితి స్పష్టంగా కనిపిస్తోంది.

కాగా బుధవారం వరకు 155 మద్యం దుకాణాలకు 1,621 దరఖాస్తులు వచ్చాయని, గడువు మరో రెండు రోజులు ఉండటంతో రెండు వేల వరకు దరఖాస్తులు వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

సరస్వతీదేవిగా వనదుర్గమ్మ



సరస్వతీదేవిగా దర్శనమిచ్చిన వనదుర్గ అమ్మవారు

తొండంగి: దసరా శరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా బుధవారం మూలానక్షత్రాన్ని పురస్కరించుకుని రత్నగిరిపై వనదుర్గ అమ్మవారు సరస్వతీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. దేవస్థాన అర్చకులు వనదుర్గ, కొండదిగువ దుర్గామాత ఆలయాల్లో నిత్యపూజలు నిర్వహించారు. అనంతరం సరస్వతీదేవిగా వనదుర్గ అమ్మవారిని అలంకరించి, ప్రత్యేక హోమాలు, అష్టోత్తర, సహస్ర నామార్చనలు చేశారు. అనంతరం భక్తులు అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

సమస్యల పరిష్కారానికి కృషిచేయండి



జిల్లా స్థాయి టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్

కాకినాడ సిటీ: ప్రజా సమస్యలపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి పరిష్కారానికి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ అధికారులను ఆదేశించారు. బుధవారం కాకినాడ కలెక్టరేట్ వివేకానంద సమావేశ మందిరంలో ప్రజా ఫిర్యాదులపై జిల్లా స్థాయి టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశంలో ఆయన జేసీ రాహుల్‌మీనా, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులతో మాట్లాడారు. గత 15 రోజులలో వచ్చిన దరఖాస్తులపై సమీక్షించి వాటి ప్రగతిని వివిధ శాఖల అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో అందిన అర్జీలను నాణ్యతతో పరిష్కరించాలన్నారు. జిల్లా స్థాయిలో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ కమిటీ ఏర్పాటు చేశామని కలెక్టర్ వివరించారు. ఈ కమిటీ సమావేశం ప్రతి శనివారం నిర్వహించనున్నట్టు తెలిపారు. ప్రతి ఫిర్యాదు గురించి సంబంధిత అధికారులకు పూర్తి అవగాహనతో సమావేశానికి హాజరు కావాలని కలెక్టర్ సూచించారు. 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకు జిల్లాలోని అన్ని పంచాయతీల్లో పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాలు నిర్వహించనున్నామని, వీటిని విజయవంతం చేయాలని ఆయన వివరించారు. జిల్లాలో సీసీ డ్రైన్లు, సీసీ రోడ్లకు సంబంధించి ఇప్పటికే ప్రతిపాదించిన పనులకు ఆమోదించినట్టు ఆయన వివరించారు. ఆయా పనులను డిసెంబర్ నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు.

నీటి సంఘాల ఎన్నికలకు 14న నోటిఫికేషన్

నీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు ఈ నెల 14న ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేయనుందని కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. ఈ నేపథ్యంలో జిల్లాలో నీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో కాకినాడ, పెద్దాపురం రెవెన్యూ డివిజన్ అధికారులు, అన్ని మండలాల తహసీల్దార్లతో నిర్వహించిన సమీక్షలో మాట్లాడారు. జిల్లాలో రెవెన్యూ అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టి పరిష్కారానికి కృషి చేయాలని ఆయన ఆదేశించారు. డంపింగ్ యార్డు, శ్మశాన వాటిక, జాతీయ రహదారులకు అవసరమైన భూమి గుర్తింపు పనులు వేగవంతం చేయాలని తెలిపారు.

అక్రమ కట్టడం తొలగింపులో ఉద్రిక్తత



వీరవరపుపేటలో అక్రమ కట్టడం తొలగింపు విషయంలో ఘర్షణ పడుతున్న పోలీసులు, బాధితులు

తుని: ప్రభుత్వ స్థలంలో నిర్మించిన అక్రమ కట్టడాన్ని తొలగించేందుకు వెళ్లిన మున్సిపల్ అధికారులు, పోలీసులను బాధితులు ప్రతిఘటించడంతో ఉద్రిక్తత చోటు చేసుకుంది. వీరవరపుపేట అంబేడ్కర్ కమ్యూనిటీ హాలు రోడ్డులో వై.రవణమ్మ అనధికారికంగా కట్టిన ఇంటిని తొలగించాలని కోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు బుధవారం మున్సిపల్ కమిషనర్ వెంకట్రావు, సీఐ చెన్న కేశవరావు వెళ్లారు. అయితే తమకు ఈ నెల 18వ తేదీ వరకు గడువు ఉందని రవణమ్మ తెలిపారు. పదేళ్లుగా కోర్టులో కేసు నడుస్తోందని, అన్ని అనుమతులు వచ్చాకే తొలగించేందుకు వెళ్లినట్టు కమిషనర్ వెంకట్రావు తెలిపారు. కోర్టు ఆదేశాలను అమలు చేసేందుకు బందోబస్తు కావాలని కమిషనర్ కోరిన మేరకు వెళ్లినట్టు సీఐ చెన్న కేశవరావు చెప్పారు. దీంతో పోలీసులు, రవణమ్మ కుటుంబ సభ్యుల మధ్య వివాదం చోటు చేసుకుంది. కోర్టు నుంచి మీకు ఏవైనా ఆదేశాలు ఉంటే చూపించాలని అధికారులు అడిగారు. ఈ నెల 18 వరకు సమయం ఉన్నందున కూల్చివేతను తాత్కాలికంగా నిలిపివేయాలని రవణమ్మ అధికారులను కోరారు. పరిస్థితి అదుపు దాటడంతో అధికారులు వెనుదిరిగారు. ఇది ఇలా ఉండగా ప్రభుత్వ స్థలంలో అక్రమ కట్టడానికి మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు ఎలా అనుమతి ఇచ్చారని రవణమ్మ ప్రశ్నించారు. దీంతో అధికారులు తెల్లముఖం వేశారు. రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు ఇచ్చే అనాలోచిత ఆదేశాల వలన ఇటువంటి పరిస్థితులు నెలకొంటాయని, అధికారులు తూచా తప్పకుండా నిబంధనలు పాటించాలని ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా సరస్వతీ పూజలు

బోట్‌క్లబ్ (కాకినాడసిటీ): దసరా ఉత్సవాల్లో భాగంగా బుధవారం మూల నక్షత్రం సందర్భంగా కాకినాడ బాలాత్రిపుర సుందరి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో సరస్వతీ పూజలు నిర్వహించారు. రెండు వేల మంది విద్యార్థులతో ఆలయ ప్రధాన అర్చకులు చెరుకూరి సుబ్రహ్మణ్యం పూజలు చేయించారు. విద్యార్థులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పుస్తకాలు, పెన్నులు ఉచితంగా పంపిణీ చేశారు.



సరస్వతీ పూజల్లో పాల్గొన్న విద్యార్థులు



పిఠాపురం పోలీసు స్టేషన్ వద్ద మాదిగ దండోరా నాయకులు

బాలిక కుటుంబానికి న్యాయం చేయాలి

మాదిగ దండోరా నాయకుల డిమాండ్

పిఠాపురం: రాజకీయ నేత చేతిలో అత్యాచారానికి గురైన బాలిక కుటుంబానికి న్యాయం చేయకపోతే తీవ్ర స్థాయిలో ఉద్యమిస్తామని మాదిగ దండోరా నాయకులు హెచ్చరించారు. బుధవారం పిఠాపురం పోలీసులను కలిసిన మాదిగ దండోరా నాయకులు బాలిక కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ పోలీసులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా దండోరా నాయకులు పిల్లి బలరాముడు, కాకాడ నూకరాజు, దూలపల్లి వెంకటరమణ, ఆకుమర్తి దుర్గ పెదపాటి వెంకటరమణ, దేవరపు సురేష్, గొడిచర్ల బాల తదితరులు మాట్లాడుతూ బాధిత బాలికకు ప్రభుత్వం అన్ని విధాలా న్యాయం చేయాలని ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. పోలీసులు ఈ కేసులో నిష్పక్షపాతంగా ఎటువంటి రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా నిందితులకు కఠిన శిక్ష పడేలా చూడాలన్నారు. ఇటువంటి దారుణానికి ఒడిగట్టిన రాజకీయ నేతకు కఠిన శిక్ష పడడం ద్వారా పోలీసు వ్యవస్థపై ప్రజలకు నమ్మకం కలిగించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు మాదిగ దండోరా నాయకులు పాల్గొన్నారు.

రుబెల్లాకు బెదరొద్దు

- ప్రమాదం లేదంటున్న వైద్యులు
- జిల్లా వాసులను వణికిస్తున్న వైరస్
- రెండు నెలల్లో 9 కేసులు నమోదు
- ప్రతి కేసును విశ్లేషిస్తున్న డబ్ల్యూహెచ్‌ఓ, జిల్లా అధికారులు



ఎర్రటి దద్దుర్లతో నిండిన రుబెల్లా బాధితుడి దేహం



బాధితుడి ఆరోగ్య స్థితిపై సర్వే నిర్వహిస్తున్న డబ్ల్యూహెచ్‌ఓ ప్రతినిధి డాక్టర్ జాన్ జుదే జాషువా

కాకినాడ క్రైం: రుబెల్లా వైరస్ జిల్లాలో విస్తరిస్తోంది. తన ఉనికిని చాటుతూ కలవరపెడుతోంది. రెండు నెలల్లో సుమారు పది మందికి వ్యాపించి అమ్మో అనిపిస్తోంది. గ్రామీణ, అర్బన్ ప్రాంతాలనే తేడా లేకుండా వైరస్ వ్యాప్తి చెందుతుండడం ఆందోళన కలిగిస్తున్నా, అధికారులు మాత్రం భయపడొద్దని భరోసా ఇస్తున్నారు. నమోదవుతున్న ప్రతి కేసును ప్రపంచ ఆరోగ్య సంస్థ తన ప్రతినిధి ద్వారా నేరుగా విశ్లేషిస్తోంది. సమాంతరంగా జిల్లా వైద్యాధికారుల పర్యవేక్షణ, నియంత్రణ కొనసాగుతోంది.

రుబెల్లా అంటే...

రుబెల్లా అనేది ఓ వైరస్ పేరు. వైరస్ వల్ల సంక్రమించే తట్టు వ్యాధి. కనీసం మూడు రోజులు రోగి శరీరంపై ఈ వైరస్ ప్రభావం ఉంటుంది. వైద్య పరీక్షలలో మాత్రమే ఈ వ్యాధి నిర్ధారణ అవుతుంది. సాధారణ లక్షణాలతో గుర్తించడం కష్టం.

దగ్గు ద్వారా వ్యాప్తి

రుబెల్లా దగ్గు ద్వారా వ్యాప్తి చెందుతుంది. శరీరంపై లక్షణాలు ప్రారంభం కావడానికి ముందు, వెనుక కూడా వ్యక్తి నుంచి మరో వ్యక్తికి వ్యాధి సంక్రమణకు అవకాశం ఉంది. రక్తం, గొంతు నుంచి సేకరించే స్వాబ్, మూత్ర పరీక్షల ద్వారా రుబెల్లా వైరస్ వ్యాప్తిని నిర్ధారిస్తారు.

గర్భిణులు జాగ్రత్త

గర్భధారణ వేళ గర్భిణికి రుబెల్లా వైరస్ సోకితే గర్భస్రావం జరిగేందుకు ఎక్కువగా ఆస్కారం ఉంది. శిశువు రుబెల్లా సిండ్రోమ్‌తో జన్మించే అవకాశం ఉంది. తద్వారా పిల్లల్లో కంటి సమస్యలు, చెవిటితనం సంభవించి గుండె, మెదడు సమస్యలు రావచ్చు. గర్భిణి 20వ వారం వరకు రుబెల్లా సోకకుండా జాగ్రత్త పడాలి.

సర్వేతో సత్ఫలితాలు..

వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఫీవర్ సర్వే సత్ఫలితాలిస్తోందని డీఐవో డాక్టర్ కేవీ సుబ్బరాజు తెలిపారు. ఈ సర్వేల ఫలితంగానే రుబెల్లా కేసులు బయటపడ్డాయని తెలిపారు. కలెక్టర్ షణ్మోహన్ ఆధ్వర్యంలో, డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహ నాయక్ పర్యవేక్షణలో క్షేత్రస్థాయి సిబ్బంది సర్వేలు నిర్వహిస్తున్నారన్నారు. శరీరంపై దద్దుర్లు, కంటి ఎరుపు గమనిస్తే తక్షణం రక్త నమూనాలు సేకరించి విజయవాడలోని ల్యాబ్‌కు పంపిస్తున్నామని సుబ్బరాజు తెలిపారు.

రెండు నెలల్లో 9 కేసులు

జిల్లాలో రెండు నెలల్లో 9 కేసులు నమోదయ్యాయని డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహ నాయక్ తెలిపారు. కాకినాడ ముత్తానగర్ రెండు, వేట్లపాలెంలలో రెండేసి చొప్పున, కాకినాడ కొండబాబు కాలనీ, తూరంగి, విరవ, రావికంపాడు, తొండంగిలలో ఒకొక్కటి చొప్పున మొత్తం 9 కేసులు నమోదయ్యాయన్నారు. జనవరి నుంచి 850 నమూనాలు సేకరించగా వాటిలో 11 రుబెల్లా కేసులు, ఆరు మీజిల్స్ కేసులు నమోదైనట్టు తెలిపారు.

ఇవీ లక్షణాలు..

దద్దుర్లు, జ్వరం, గొంతునొప్పి, అలసట తొలి దశలో ఉంటాయి. వైరస్ ప్రభావం ముదిరితే కీళ్లనొప్పులు, రక్తస్రావం, వృషణ వాపు, నరాల వాపు ఉంటాయి.

ప్రమాదం లేదు



ప్రస్తుతం పరిస్థితి అదుపులోనే ఉంది. రుబెల్లా వైరస్ వల్ల ప్రమాదం లేదు, ప్రాణాపాయం కాదు. లక్షణాల ఆధారంగా యాంటీబయాటిక్స్‌ను వినియోగిస్తారు. అన్ని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలలోనూ చికిత్స అందుబాటులో ఉంది. తగినన్ని మందులు ఉన్నాయి. ప్రజలు భయపడవద్దు. దగ్గు, గాలి, తుంపర్ల ద్వారా వ్యాప్తి చెందే అవకాశం ఉంది. జాగ్రత్త వహించాలి. తొమ్మిదో నెలలో శిశువులకు ఎంఆర్ టీకా వేయిస్తే వారికి భవిష్యత్‌లో రుబెల్లా, మీజిల్స్ రావు.

– డాక్టర్ నరసింహ నాయక్, డీఎంహెచ్‌వో, కాకినాడ జిల్లా

రంగంలోకి డబ్ల్యూహెచ్‌ఓ

జీరో ఎంఆర్ దిశగా లక్ష్యాన్ని నిర్దేశించిన ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) గురి తప్పింది. 2023 నాటికి రుబెల్లాను పూర్తిగా అంతమొందించాలని నిర్ణయించి లక్ష్యాన్ని చేరుకోవడంలో తడబడింది. ఈ నేపథ్యంలో మరింత గట్టిగా నివారణ చర్యలు తీసుకోవాలని నిర్ణయించింది. రుబెల్లాను గుర్తిస్తున్న ప్రాంతాలకు నేరుగా తమ ప్రతినిధులను పంపుతోంది. అలా తమిళనాడుకు చెందిన డాక్టర్ జాన్ జుదే జాషువాను విశాఖ కేంద్రంగా నియమించి కాకినాడ జిల్లాకు పంపింది. ఆయన నేరుగా ప్రభావిత ప్రాంతాల్లో బాధితులతో మాట్లాడి వివరాలు సేకరించి డబ్ల్యూహెచ్‌వో, కేంద్ర ఆరోగ్య సంస్థలకు నివేదిస్తున్నారు.

క్లుప్తంగా

భగవంతుడు సర్వాంతర్యామి



మాట్లాడుతున్న పరిపూర్ణానంద స్వామి

కాకినాడ రూరల్: భగవంతుడు సర్వాంతర్యామి అని పరిపూర్ణానంద స్వామి అన్నారు. కాకినాడ శ్రీ పీఠంలో జరుగుతున్న మహాశక్తి యాగంలో భాగంగా బుధవారం సుమారు 30 వేల మంది విద్యార్థులతో త్రికోటి సరస్వతి పూజ ఘనంగా నిర్వహించారు. సరస్వతీమాత ఫొటో, పూజా సామగ్రిని నిర్వాహకులు అందజేయగా విద్యార్థులు ఈ పూజలో పాల్గొన్నారు. కాకినాడ జిల్లాతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హాజరు కావడంతో శ్రీపీఠం ప్రాంగణమంతా కిక్కిరిసిపోయింది. చిన్నారులు సరస్వతీ పూజలో ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రముఖ తెలుగు కవి, సినీ గేయ రచయిత జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు మాట్లాడుతూ వేదవిద్య కూడా సరస్వతీ స్వరూపమే అన్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.

అక్షరాభ్యాసాలు

శ్రీ పీఠంలోని ఐశ్వర్యాంబిక ఆలయ ప్రాంగణంలో బుధవారం అక్షరాభ్యాసాలు ఘనంగా జరిగాయి. సుమారు 200 మంది చిన్నారులతో వారి తల్లిదండ్రులు అక్షరాలను దిద్దించారు.

15న అరుణాచలానికి ప్రత్యేక బస్సులు

రామచంద్రపురం రూరల్: అరుణాచలం గిరి ప్రదక్షిణ, స్వామివారి దర్శనం చేసుకునే భక్తుల కోసం ఈ నెల 15వ తేదీన రామచంద్రపురం ఆర్టీసీ డిపో నుంచి సూపర్ లగ్జరీ, పుష్ బ్యాక్ వీడియో కోచ్ బస్సులు బయలుదేరుతున్నాయి. ఈ విషయాన్ని డిపో మేనేజర్ పేపకాయల భాస్కరరావు బుధవారం విలేకరులకు తెలిపారు. బస్సులు రామచంద్రపురం నుంచి బయలుదేరి విజయవాడ, శ్రీకాళహస్తి, శ్రీనివాస మంగాపురం (తిరుపతి), కాణిపాకం, అర్ధగిరి ఆంజనేయస్వామి, శ్రీపురం (మహాలక్ష్మి అమ్మవారి బంగారు గుడి) మీదుగా 17వ తేదీకి అరుణాచలం చేరుకుంటాయన్నారు. పౌర్ణమి రోజు అరుణాచలగిరి ప్రదక్షిణ, దర్శనాల అనంతరం కంచి, తిరుత్తణి క్షేత్రాల మీదుగా 18న రామచంద్రపురం తిరిగివస్తాయన్నారు. టిక్కెట్లను బుక్ చేసుకునేందుకు 73829 12064, 99489 39888, 73829 12146, 94939 53838, 73829 10769, 73829 15520 నంబర్లను సంప్రదించాలన్నారు. టిక్కెట్ ధర రూ.3,200గా నిర్ణయించామని, భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎండాకు వణుకు

- విజృంభిస్తున్న ఎండాకు తెగులు
- వరిపంటపై దాడి
- ఆందోళనలో రైతులు

ఆలమూరు: ఖరీఫ్ సాగు చేతి కొచ్చే తరుణంలో ఎండాకు తెగులు వెంటాడుతోంది. ఇప్పటి వరకూ ప్రకృతి వైపరీత్యాలతో రైతులు ఇబ్బందులు పడ్డారు. ఇక పంట దుక్కుతుందని భావిస్తున్న సమయంలో ఎండాకు తెగులు అష్టకష్టాలు పెడుతోంది. ఇటీవల ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాలు, వరదల ప్రభావంతో ఈ తెగులు వ్యాప్తి చెందింది. దీంతో రైతులకు కంటి మీద కునుకు ఉండడం లేదు. జిల్లాలో ఈ ఖరీఫ్ సీజన్‌లో సుమారు 1.58 లక్షల ఎకరాల్లో వరి సాగు జరిగింది. భారీ వర్షాలు కురిసిన కొన్ని ప్రాంతాల్లో గడచిన నెల రోజుల నుంచి ఎండాకు తెగులు తీవ్రంగా ఉంది.

అన్నదాతల ఆందోళన

జిల్లాలోని పలు మండలాల్లో ముందుగా సాగు చేసిన వరి పంట ప్రస్తుతం కంకి గట్టి పడే దశలో ఉంది. ఆలస్యంగా వరినాట్లు వేసిన చోట్ల మాత్రం కంకి వేస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో ఈ తెగులు సోకడం వల్ల అన్నదాతలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ ఖరీఫ్ సీజన్‌లో పెట్టుబడి సాయం అందించలేదు. రైతులు అప్పులు చేసి మరీ సాగును చేపట్టారు. పంట తుది దశలో హఠాత్తుగా ఎండాకు తెగులు సంభవించడంతో అన్నదాతలకు ఏమి చేయాలో తెలియని పరిస్థితి నెలకొంది. దీన్ని సరైన సమయంలో గుర్తించి సస్యరక్షణ చర్యలు చేపడితే నివారణ సాధ్యమేననే అభిప్రాయం వ్యక్తమవుతుంది. ఈ తెగులు సోకిన చేలల్లో కొందరు రైతులు కాండం కుళ్లు లేదా దుబ్బు కుళ్లు తెగులుగా పొరబడి శిలీంద్ర నాశినిలను పిచికారీ చేస్తున్నారని వ్యవసాయశాఖ నిపుణులు చెబుతున్నారు. దీనివల్ల మరింత పంట నష్టం జరిగే అవకాశం ఉందన్నారు.

నిర్ధారణ తప్పనిసరి

వరిపైరుకు ఉన్న లక్షణాలను బట్టి ఎండాకు తెగులు సోకినట్లుగా గుర్తిస్తే ఆ మేరకు వ్యవసాయశాఖ సూచనలు, సలహాలను తీసుకోవాలి. వారి సలహాల మేరకు నష్టనివారణ చర్యలు తీసుకోవాలి. ఎండాకు తెగులును త్వరితగతిన నిర్ధారించి నష్ట నివారణ చర్యలు తీసుకుంటే సకాలంలో నివారించవచ్చు. వరిపైరుపై ఎండాకు తెగులు మూడు దశల్లో సోకుతుంది. జాంథో మోనాస్ ఓరైజ్ లేదా పాథోవార్ ఓరైజ్ అనే బ్యాక్టీరియా వల్ల ఇది ఆశిస్తుంది. నారుమడి దశలో ఆకుల అంచుల నుంచి డాగు మచ్చలుగా ఏర్పడుతుంది. ఒక్కొక్క ప్రాంతంలో భూసారాన్ని బట్టి నారుమళ్లు వేసిన నెల రోజుల తరువాత కూడా సోకవచ్చు. తెగులు ఉధృతిగా ఉన్నప్పుడు దుబ్బులోని కొన్ని పిలకలు చనిపోతుంటాయి. ఎండిన ఆకులను ముక్కలుగా కత్తిరించి మంచినీటిలో ఉన్న గ్లాసులో వేసి అరగంట తరువాత నీటిని గమనిస్తే తెగులు సోకిన భాగాల నుంచి తెగులుకు సంబంధించి బ్యాక్టీరియా నీటిలో కలిసిపోయి పసుపురంగులోకి మారిపోతే ఎండాకు తెగులుగా గుర్తించాలి.

వాతావరణంలో మార్పులు

వాతావరణంలో సంభవిస్తున్న మార్పుల వల్ల ఎండాకు తెగులు దశను మార్చుకుంటుంది. వరి పిలకలు వేసే దశలో కానీ, కంకి గట్టి పడే దశలో కానీ ఈదురు గాలులలో కూడిన వర్షాలు కురిస్తే ఈ వ్యాధి సోకుతుంది. 32 డిగ్రీల ఉష్ణోగ్రత కంటే తక్కువగా ఉన్న వాతావరణంలో మొక్కల సాంద్రత ఎక్కువగా పొలాల్లో సోకుతుంది. వరి సాగులో అధిక నత్రజని వాడితే ఈ ఎండాకు తెగులు సోకి పంటను తీవ్రంగా నష్టపర్చే అవకాశం ఉంటుంది. తెగులు ఉధృతిగా ఉన్న సమయంలో వరిదుబ్బులపై మచ్చలు తీవ్రత పెరిగి ఆకులన్నీ ఎండిపోయే అవకాశం ఉంటుంది. తెగులు సోకిన పొలాల్లో ఆకు ఉదయం పూట పసుపురంగులో ఉంటుంది. ఆకుపై జిగురు వంటి పదార్థం బిందువులుగా బయటకు ఉబికి వస్తుంది. ఎండ తీవ్రత పెరిగే కొద్ది క్రమేపీ బిందువులు ఎండిపోయి నీటిలో పడిపోవడం వల్ల మళ్లీ ఆకులు యథాస్థితికి చేరుకుంటాయి. సాగునీటి ద్వారా ఒక పొలం నుంచి మరో పొలానికి వ్యాప్తి చెందుతుంది.



ఎండాకు తెగులు ఆశించిన వరిచేను



క్రిమి సంహారక మందును పిచికారీ చేస్తున్న రైతులు



ఎండాకు తెగులు సోకిన వరి దుబ్బు

అవగాహనతోనే నివారణ సాధ్యం

వ్యవసాయశాఖ సూచనలు, సలహాలతో పాటు సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే ఎండాకు తెగులును సకాలంలో నిర్మూలించడం సాధ్యమేనని జిల్లా వ్యవసాయాధికారి ఓలేటి బోసుబాబు చెబుతున్నారు. ఆయన చేసిన సూచనల ప్రకారం..

- వ్యవసాయశాఖ నిర్దేశించిన మోతాదులో మాత్రమే నత్రజనిని వినియోగించాలి.
- వాతావరణ పరిస్థితుల్లో మార్పులు సంభవిస్తే నత్రజని ఎరువుల వాడకాన్ని సత్వరమే నిలిపివేసి, మళ్లీ ఎండ కాసిన తరువాత పునఃప్రారంభించాలి.
- వ్యవసాయశాఖ సిఫారసు చేసిన పొటాష్‌ను మ్యూరేట్ ఆఫ్ పొటాష్ రూపంలో రెండు దఫాలుగా నాట్లు వేసే సమయంలో ఉపయోగించాలి.
- పొలం గట్ల వెంబడి అక్కడక్కడ ఉండే కలుపు మొక్కలను తొలగిస్తే తెగులు సోకే బ్యాక్టీరియా వ్యాప్తి చెందే అవకాశం ఉండదు.
- పొలం చుట్టూ చెత్తాచెదారాన్ని తొలగించడంతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి.
- ఎండాకు తెగులు సోకిందని భావిస్తే పొలంలో అప్పటి వరకూ ఉన్న సాగునీటిని రెండు లేదా మూడుసార్లు బయటకు పంపించి వేసి మళ్లీ కొత్తగా నీరును నింపుకోవాలి.
- ఎకరాకు 20 కేజీల పొటాష్‌ను వరిపైరు పూర్తిగా అందే వరకూ పైపాటుగా ఉపయోగించాలి.
- కాపర్ హైడ్రాక్సైడ్ మందును రెండు గ్రాములు లేదా కాపర్ సల్ఫేట్ రెండు మిల్లీలీటర్ల మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. ఈ విధంగా పది రోజుల వ్యవధిలో రెండుసార్లు చేస్తే ఎండాకు తెగులు నుంచి పూర్తిగా బయటపడవచ్చు.

కాకినాడలో కూటమి నాయకుల కొట్లాట

కాకినాడ: కూటమి ప్రభుత్వంలోని ఇద్దరు నాయకుల మధ్య జరిగిన కొట్లాట పోలీసుస్టేషన్ వరకూ వెళ్లింది. వివరాల్లోకి వెళితే.. కాకినాడ గాంధీనగర్‌లోని కొయ్యలవారివీధి ప్రాంతానికి చెందిన స్థానికులు పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా లేదంటూ ప్రజారోగ్య విభాగానికి ఫిర్యాదు చేశారు. దీంతో ఎంహెచ్‌వో ఆదేశాల మేరకు ఆ ప్రాంతానికి చెందిన శానిటరీ ఇన్‌స్పెక్టర్, పారిశుద్ధ్య సిబ్బంది, స్థానికంగా ఉన్న టీడీపీ నాయకులతో కలిసి వెళ్లారు. అయితే స్థానికులు, అక్కడకు వెళ్లిన సిబ్బంది, ఇతర టీడీపీ కార్యకర్తలు ఫిర్యాదు చేసిన సిబ్బందిపై విరుచుకుపడ్డారనే సమాచారం.దీంతో సమస్యను పరిష్కరించకుండా ప్రజలను బెదిరించడం ఏమిటంటూ మాజీ కార్పొరేటర్ గోడి సత్యవతి భర్త, బీజేపీ నాయకుడు గోడి వెంకట్ ప్రజలకు మద్దతుగా వెళ్లారు. అతడిపై టీడీపీ నాయకుడు జొన్నాడ వెంకట రమణ దాడికి యత్నించారు. ఈక్రమంలో ఇరువర్గాల మధ్య తోపులాట జరిగి., ఘర్షణ వాతావరణం నెలకొంది. స్థానికులు సర్దిచెప్పడంతో ఇరు వర్గాలు అక్కడి నుంచి వెళ్లిపోయాయి. అనంతరం గోడి వెంకట్ తనపై దాడి చేశాడంటూ టీడీపీ నాయకుడు వెంకట రమణ పోలీసుల దృష్టికి తీసుకువెళ్లారు. విషయం తెలుసుకున్న బీజేపీ నాయకులు ఇరువర్గాలనూ రాజీ చేసేందుకు ప్రయత్నిస్తున్నారు.



గోడి వెంకట్‌పై దాడి చేస్తున్న టీడీపీ నాయకులు

బాలికపై అత్యాచారం కేసులో నిందితుల అరెస్టు

పిఠాపురం: బాలికపై అత్యాచారం కేసులో నిందితులను బుధవారం అరెస్టు చేసినట్లు సీఐ శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు బుధవారం తన కార్యాలయంలో నిందితులను మీడియా ముందు హాజరుపరిచారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. పిఠాపురం పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో 16 ఏళ్ల బాలికను ఈ నెల 7వ తేదీ సాయంత్రం ఆటో డ్రైవర్, అతడి స్నేహితురాలు కిడ్నాప్ చేశారు. ఆటోలో మాదాపురం గ్రామ శివారులోని డంపింగ్ యార్డు సమీపంలోని గోదావరి కాలువ గట్టు వద్దకు తీసుకువెళ్లారు. బాలికకు బలవంతంగా మద్యం పట్టించారు. అనంతరం ఆటో డ్రైవర్ అత్యాచారం చేశాడు. ఈ సంఘటనపై పిఠాపురం టౌన్ పోలీస్ స్టేషన్లో నమోదైంది. ఎస్పీ విక్రాంత్ పాటిల్, డీఎస్పీ రఘువీర్ విష్ణు పర్యవేక్షణలో కేసులో నిందితులను పట్టుకోవడానికి మూడు బృందాలను ఏర్పాటు చేసి గాలించారు. పిఠాపురం అయితే నగర్‌కు చెందిన దుర్గాలక్ష్మయ్య అలియాస్ జాన్, ఇందిరా నగర్‌కు కొంగుపూడి సుబ్బలక్ష్మిలను బుధవారం గొర్స రోడ్డులోని రైస్‌మిల్లు సమీపంలో అరెస్టు చేశారు. అనంతరం నిందితులను కోర్టులో హాజరుపరిచారు. నిందితుడి నుంచి ఆటో, దుస్తులు, మద్యం సీసాను స్వాధీనం చేసుకున్నారు.



నిందితులను విలేకరులకు చూపిస్తున్న పోలీసులు

టీడీపీ నాయకుడి ఇంట్లో తెలంగాణ మద్యం

6,144 క్వార్టర్ బాటిళ్లు స్వాధీనం

తుని రూరల్: కాకినాడ జిల్లా తుని మండలం కేఓ మల్లవరం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు సుర్ల గోవిందరాజులు ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన తెలంగాణ మద్యం సీసాలను రూరల్ పోలీసులు పట్టుకున్నారు. మంగళవారం రాత్రి రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ చెన్నకేశవరావు, ఎస్సై బి.కృష్ణమాచారి తుని మండలం ఎస్.అన్నవరం శివారు శేషాద్రినగర్‌లో నివాసం ఉంటున్న సుర్ల గోవిందు ఇంట్లో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. దీంతో రూ.2,45,760 విలువ చేసే 128 కేసుల (6,144 క్వార్టర్ బాటిళ్లు) తెలంగాణ మద్యాన్ని గుర్తించారు. 2021లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో గోవిందరాజులు భార్య ఎంపీటీసీ సభ్యురాలిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కొద్దిరోజులకే టీడీపీలో చేరారు. పిల్లలు చదువుల పేరుతో తుని మండలం ఎస్.అన్నవరం శివారు శేషాద్రినగర్‌లో నివాసం ఉంటున్న గోవిందరాజులు ఇంట్లో పెద్ద ఎత్తున మద్యం నిల్వలు లభించాయి. ఖమ్మం, వరంగల్ నుంచి తెలంగాణ మద్యం జిల్లాకు వచ్చిన సమాచారంతో సాధారణ తనిఖీలు నిర్వహించిన పోలీసులకు అక్రమ మద్యం నిల్వలు లభించాయి. ఇందుకు బాధ్యులైన గోవిందరాజులు, పసగడుగుల చీడిగిత ల్లిపై కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు. స్వాధీనం చేసుకున్న మద్యాన్ని రూరల్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దీనిపై లోతుగా విచారణ చేస్తున్నామని, అక్రమ వ్యాపారాలపై ప్రత్యేక నిఘా ఉంచినట్టు సీఐ తెలిపారు. అక్రమార్కులు ఏ పార్టీ అయినా విడిచిపెట్టేది లేదని, మద్యం మాఫియాను ఉపేక్షించబోమని హెచ్చరించారు. తనిఖీల్లో మరిన్ని నిల్వలు బయటపడే అవకాశాలు ఉన్నాయని, అధికార పార్టీ నాయకులు మరింత మంది ఉన్నట్టు తెలుస్తోంది.

మద్యం సీసాలతో ఇద్దరు టీడీపీ కార్యకర్తల అరెస్టు

తుని మండలం కేఓ మల్లవరంలో అక్రమంగా మద్యం సీసాలు కలిగి ఉన్న ఇద్దరు టీడీపీ కార్యకర్తలను తుని రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. రూరల్ ఎస్సై బి.కృష్ణమాచారి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని రెండు ప్రాంతాల్లో పోలీసులు ఆకస్మిక దాడులు చేశారు. ఈ సందర్భంగా గాలి గోవిందు వద్ద 94 బాటిళ్లు, గాలి కృష్ణ వద్ద 72 సీసాలు స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కేసులు నమోదు చేసి అరెస్టు చేశారు.



స్వాధీనం చేసుకున్న అక్రమ మద్యాన్ని పరిశీలిస్తున్న సీఐ చెన్నకేశవరావు, ఎస్సై కృష్ణమాచారి



మద్యం సీసాలు, నిందితుడితో ఎస్సై కృష్ణమాచారి, సిబ్బంది

నేటి నుంచి బాస్కెట్ బాల్ పోటీలు

రామచంద్రపురం: కృత్తివెంటి పేర్రాజు పంతులు ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా ప్రాంగణంలో గురువారం నుంచి ఈ నెల 12వ తేదీ వరకూ 9వ సబ్ జూనియర్స్ అంతర జిల్లాల బాస్కెట్ బాల్ పోటీలు జరగనున్నాయి. మాజీ లోక్‌సభ స్పీకర్ జీఎంసీ బాలయోగి జ్ఞాపకార్థం వీటిని నిర్వహిస్తున్నట్టు ఏపీ బాస్కెట్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గన్నమని చక్రవర్తి, రామచంద్రపురం బాస్కెట్ బాల్ అధ్యక్షుడు డాక్టర్ సి.స్టాలిన్ తెలిపారు. ఈ పోటీలను ఉదయం 9 గంటలకు రాష్ట్ర కార్మికశాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్ ప్రారంభిస్తారన్నారు. ఈ నెల 12న జరిగే ముగింపు సభలో ఎంపీ గంటి హరీష్ మాధుర్, రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్ చంద్రబోస్ పాల్గొంటారన్నారు.

ఇంద్రకీలాద్రిపై గరగ నృత్యం

అంబాజీపేట: శరన్నవరాత్రుల సందర్భంగా విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై జరుగుతున్న కనకదుర్గమ్మ ఉత్సవాలలో ముక్కామలకు చెందిన గరగ నృత్య కళాకారులు ప్రదర్శన ఇచ్చారు. ఈ నెల 6, 7, 8 తేదీలలో జరిగిన వాహన సేవలో వీరందరూ పాల్గొన్నారు. ఆలయ ఈవో నుంచి వచ్చిన ఆహ్వానం మేరకు పసుపులేటి నాగబాబు ఆధ్వర్యంలోని విజయదుర్గ నాట్యబృందం (కళాకారులు) విజయవాడకు తరలివెళ్లింది.



కనకదుర్గమ్మ ఆలయం వద్ద ప్రదర్శన ఇస్తున్న గరగ నృత్య కళాకారులు (ఫైల్)

రెండు బైకులు ఢీకొని ముగ్గురికి గాయాలు

మండపేట: రెండు బైకులు ఢీకొన్న ఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. గొల్లపుంత కాలనీకి వెళ్లే రోడ్డులో బుధవారం ఈ ప్రమాదం జరిగింది. వేదరాజు సత్యనారాయణ రాజు ద్విచక్ర వాహనంపై మండపేట మార్కెట్‌కు వచ్చి తిరిగి గొల్లపుంత కాలనీలోని తన ఇంటికి బయలు దేరాడు. అదే సమయంలో కాలనీ నుంచి పెదప్రోలు వికాస్, మణి మోటారు సైకిల్‌పై వేగంగా వచ్చి సత్యనారాయణరాజును ఢీకొట్టారు. విషయం తెలుసుకున్న టౌన్ ఎస్సై హరికోటి శాస్త్రి హుటాహుటిన సంఘటనా ప్రాంతానికి చేరుకున్నారు. క్షతగాత్రులను వెంటనే స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఢీ కొట్టిన యువకులిద్దరికీ స్వల్పంగా, సత్యనారాయణరాజుకు తీవ్ర గాయాలయ్యాయి.

జాతీయ పోటీలలో సత్తా చాటాలి

రాజానగరం: అంతర్ జిల్లాల స్థాయిలో క్రీడా పోటీలలో పాల్గొన్న వారందరూ మరింత ప్రతిభను కనబరచి, జాతీయ స్థాయిలో సత్తా చాటాలని డిప్యూటీ డీఈఓ ఈవీఈఎస్ఎస్ఎన్‌బీఎల్ నారాయణ అన్నారు. దివాన్ చెరువులోని శ్రీప్రకాష్ విద్యానికేతన్‌లో ఏపీ పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో మూడు రోజులుగా జరుగుతున్న 68వ ఆంధ్రప్రదేశ్ అంతర్ జిల్లాల ఎస్‌జీఎఫ్ హ్యాండ్‌బాల్ టోర్నమెంట్ బుధవారం ముగిసింది. బాలుర అండర్ 17 కేటగిరీలో హోరాహోరీగా జరిగిన ఈ పోటీలలో విజేతలకు ముగింపు కార్యక్రమంలో బహుమతులు అందజేశారు. ప్రథమ స్థానంలో చిత్తూరు, ద్వితీయ స్థానంలో శ్రీకాకుళం, తృతీయ స్థానంలో తూర్పుగోదావరి జట్లు నిలిచాయి. ఈ పోటీలలో అత్యుత్తమ ప్రతిభ చూపిన క్రీడాకారులను జాతీయ స్థాయి పోటీలకు పంపిస్తామని ఎస్‌జీఎఫ్ కార్యదర్శి ఎస్ఆర్‌కేవీ స్వామి తెలిపారు. ఈ మేరకు ఎంపికైన 16 మంది క్రీడాకారుల వివరాలు వెల్లడించారు. వారిలో కాకూరి తేజసాయిరెడ్డి, తంగరాజు, మిడపాల యోగేశ్వర్ (చిత్తూరు), రాజనాల వెందత్తసాయి, చిన్ని దిల్లేశ్వరరావు (శ్రీకాకుళం), కొల్లాబత్తుల షెల్విక్, అంగారపు వెంకట్ గణేష్ (తూర్పు గోదావరి), ఆకుల దేవ్ సూర్యసాయి (విశాఖపట్నం), పిల్లా దేవి చరితసత్య (ప్రకాశం), పిడిది జశ్వంత్ (విజయనగరం), ముడే ప్రసాద్ నాయక్ (కర్నూల్), దాసరి జాషువా (నెల్లూరు), వనం గౌరీశంకర్ (విశాఖపట్నం), మోపిదేవి తాన్విత (కృష్ణ), అద్దంకి రాజ్‌పాల్ (గుంటూరు), కత్తిక చైతన్యకుమార్ (తూర్పు గోదావరి) ఉన్నారు. కార్యక్రమంలో శ్రీప్రకాష్ విద్యానికేతన్ కరస్పాండెంట్ విజయ్‌ప్రకాష్, పరిశీలకులు ఎంవీ నాగేంద్ర, ప్రిన్సిపాల్ విమల, సీనియర్ ప్రిన్సిపాల్ ఎంవీవీఎస్ మూర్తి, మేనేజర్ ఎఎస్ఎన్ మూర్తి, ఉపాధ్యాయ సంఘ కార్యదర్శి ఎస్.నాగరాజు, వీరబాబు, గంగాధర్ పాల్గొన్నారు.



ప్రథమస్థానంలో నిలిచిన చిత్తూరు జట్టు

ఆలయానికి రూ.30 లక్షల భూమి దానం



భూమిదాన పట్టా నమూనాను అందజేస్తున్న రెడ్డి ఆదిమూర్తి దంపతులు

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): కాకినాడలోని బాలా త్రిపుర సుందరీ సమేత రామలింగేశ్వరస్వామి దేవస్థానానికి నగరానికి చెందిన రెడ్డి ఆదిమూర్తి, అనురాధ దంపతులు 50 సెంట్ల భూమిని బుధవారం దానం చేశారు. ఈ భూమి దానపట్టాను కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు సమక్షంలో అందజేశారు. జగ్గంపేట మండలం కాండ్రేగుల గ్రామంలో ఉన్న ఆ భూమి విలువ రూ.30 లక్షలు ఉంటుంది. ఈ సందర్భంగా దాతలకు ఆలయ ఈఓ వీర్రాజు చౌదరి అమ్మవారి చిత్రపటం, ప్రసాదం అందించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ గ్రంధి బాబ్జి పాల్గొన్నారు.